సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 18 । మే । 2023



పదోన్నతుల పర్వం ప్రారంభం

ఉపాధ్యాయుల ప్రమోషన్లకు రంగం సిద్ధమైంది. నేడు, రేపు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. - 8లో



స్పందన కరువు

టీడీపీ నిర్వహించిన మినీ మహానాడుకు స్పందన కరువైంది. జనాలు లేక వెలవెలబోయింది. - 8లో

పనివేళలు మార్చుకోండి

కాశీబుగ్గ : ఎండవేడి నుంచి తప్పించుకునేందుకు పనివేళలు మార్చుకోవాలని పలాస అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయకుమార్ అన్నారు. వడగాలుల నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో బుధవారం కార్మికులను కలిసి అవగాహన కల్పించారు. ఉదయం, సాయంత్రం వేళ పనిచేసి, ఎండ సమయంలో విరామం తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఈకేవైసీ తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఉప ఖజానా కార్యాలయాల ద్వారా జీతభత్యాలు, వేతనాలు, పింఛన్లు పొందుతున్న వారు ఈ నెల 20లోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఖజానా శాఖ డీడీ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ నంబర్‌ను లింక్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 56 శాతం మంది మాత్రమే పింఛనుదారులు ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా నిర్దేశిత కాలంలో చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో 500 మందికి లైఫ్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉందన్నారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, ఔట్ సోర్సింగ్, వీఆర్‌ఏ డైలీ వేజెస్, హోంగార్డులు తదితర ఉద్యోగుల సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, ఆధార్ లింక్‌ను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని సూచించారు.

19న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు 2వ స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, 12 గంటలకు 7వ స్థాయి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1వ స్థాయి సమావేశాలు జరుగుతాయని వివరించారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు 6వ స్థాయి, 4 గంటలకు 3వ స్థాయి, 5 గంటలకు 5వ స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా స్థాయీ సంఘ చైర్మన్లు అధ్యక్షత వహించనున్నారని, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తాజా శాఖాప్రగతి నివేదికలతో విధిగా హాజరుకావాలని కోరారు.

ఆదిత్యుని సన్నిధిలో రాజ్‌కుమార్



స్నేహితుడితో కలిసి రాజ్‌కుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ప్రముఖ సినీ నటుడు వి.వి.రాజ్‌కుమార్ స్నేహితులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ..ఇప్పటివరకు వందలాది సినిమాలు, టీవీ సీరియల్స్‌లో నటించానని, ప్రస్తుతానికి బుల్లితెరనే నమ్ముకున్నానని వివరించారు. ఈయన వెంట డాక్టర్ సంతోష్ తదితరులున్నారు.

అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర క్రికెట్ జట్టును ఎంపికచేశారు. ఇటీవల జిల్లా అండర్-19 ప్రాబబుల్స్ జట్టుకు సెలక్షన్ మ్యాచ్‌లను నిర్వహించిన అనంతరం అందులో రాణించిన 21 మంది క్రీడాకారులతో కూడిన జాబితాను జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ బుధవారం వెల్లడించారు. వీరిని తగరపువలసలో ఉన్న కందుకూరి స్పోర్ట్స్ అకాడమీలో ఈ నెల 19 నుంచి జరగనున్న శిక్షణా శిబిరానికి పంపించి తుది జట్టును ప్రకటిస్తామన్నారు. సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో కె.కిరణ్, సైలానీ, ప్రవీణ్‌ల సభ్యులతో కూడిన కమిటీ జిల్లా జట్టును ఎంపికచేసిందని పేర్కొన్నారు.

జిల్లా జట్టు: డీవీఎస్ శ్రీరాం (కెప్టెన్), ప్రద్యున్ సాయి (వైస్ కెప్టెన్), ఎం.పూర్ణచంద్ర, ఎం.రోహిత్, సిద్ధాంత్.కె,కృష్ణ, అవినాష్, సిద్ధు విగ్నేష్, ఎస్.సుశాంత్, పి.సతీష్, థామస్ (వికెట్ కీపర్), అజయ్ (వికెట్ కీపర్), గణేష్ సాయి, ఆర్.జయరాం, మోహన్ రిషి, పీఎం వెంకట్‌సాయి, రిషికేష్, జున్నారావు, సాయిసృజన, ఎస్.రాము, బిళ్ల అభిషేక్.

సజావుగా మూడో రోజు ఏపీఈఏపీ సెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (ఏపీ ఈఏపీ సెట్) పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. టెక్కలి ఐతం కేంద్రంలో మొదటి షిఫ్టులో 219 మంది, రెండో షిఫ్టులో 220 మంది, చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 184 మంది, రెండో షిఫ్టులో 183 మంది, ఎచ్చెర్ల వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రంలో మొదటి షిఫ్టులో 182 మంది, రెండో షిఫ్టులో 181 మంది హాజరయ్యారు. ఈ నెల 23 వరకు పరీక్షలు జరగనున్నాయి.

భానుడి భగభగ








వెలవెలబోతున్న శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి

జిల్లాలో ఉష్ణోగ్రతల తీరు

మండలం (ప్రాంతం)	మంగళవారం		బుధవారం	
	గరిష్టం	కనిష్టం	గరిష్టం	కనిష్టం
శ్రీకాకుళం	40	29	35	27
ఆమదాలవలస	40	30	37	27
పాతపట్నం	39	29	36	26
నరసన్నపేట	40	29	37	27
టెక్కలి	39	29	38	26
పలాస	40	30	37	27
ఇచ్ఛాపురం	39	29	38	27
కొత్తూరు	40	29	37	26
రణస్థలం	40	30	38	27

వడదెబ్బ లక్షణాలు..
- చెమట పట్టకపోవడం
- గొంతు పొడిబారిపోవడం
- వణుకు పుట్టడం
- మగతనిద్ర, ఫిట్స్ రావడం



- జిల్లాలో గరిష్టంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడగాడ్పులు, ఉక్కపోతతో విలవిల్లాడుతున్న జనం
- మరో ఐదు రోజులు ఇదే పరిస్థితి!
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు
- నిర్మానుష్యంగా రహదారులు

ఆమదాలవలస/కోటబొమ్మాళి: భానుడు భగభగమంటున్నాడు. ఎండలతో ఠారెత్తిస్తున్నాడు. వారం రోజులుగా వడగాలులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే నిప్పులు కురిపిస్తుండటంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావడం లేదు. జిల్లాలో బుధవారం గరిష్టంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు గత ఎనిమిదేళ్లలో ఇదే తొలిసారని వాతావరణశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవల ఒడిశా, మయన్మార్ ప్రాంతాల వైపు మళ్లిన తుఫానే అధిక ఉష్ణోగ్రతలకు కారణమని అంటున్నారు. గత రెండు రోజులుగా జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆమదాలవలస, నరసన్నపేట, పలాస, కొత్తూరు, రణస్థలంలోనూ ఇదే స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కాగా బుధవారం కాస్త తగ్గాయి. టెక్కలి, రణస్థలం, ఇచ్ఛాపురంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉదయం 11 గంటలకు రోడ్లు బోసిపోయాయి. ఎప్పుడు రద్దీగా ఉండే శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస కూడళ్లలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వైద్యుల సూచనలతో ప్రజలు 8 గంటల నుంచే ఇళ్లకు పరిమితమవుతున్నారు. అత్యవసర పని నిమిత్తం బయటకు వచ్చిన వారు డీహైడ్రేషన్‌కు గురికాకుండా కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్లరసాలు తీసుకుంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారినా వడదెబ్బ తగిలినట్లు గుర్తించి వెంటనే వైద్యుని వద్దకు వెళ్లాలని చెబుతున్నారు.



నిర్మానుష్యంగా ఆమదాలవలస-పాలకొండ రహదారి

పంటలపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం..

అధిక ఉష్ణోగ్రతలు పంటలపై ప్రభావం చూపిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి, వేసవి పెసర, నువ్వులపంట కోత కోస్తున్న రైతులు అధిక ఉష్ణోగ్రతల్లో కాకుండా సాయంత్రం సమయంలో పనులు చేసుకోవడం ఉత్తమం. ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవి లోతు దుక్కులు దున్నుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల అవశేషాలు, కలుపు విత్తనాలు భూమి ఉపరితలానికి చేరి సూర్యరశ్మి ద్వారా నిర్మూలనవుతాయి.

ప్రథమ చికిత్స..
- వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడ ప్రదేశానికి చేర్చాలి
- సాధారణ స్థితికి వచ్చేవరకూ చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి.
- ఫ్యాన్ గాలి తగిలేలా ఏర్పాట్లు చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ గానీ, గ్లూకోజ్ ద్రావణం గానీ, ఓఆర్ఎస్ ద్రావణం గానీ తాగించాలి.
- వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తరలించాలి.

ఎండలో తిరగవద్దు..

ప్రస్తుతం ఎండతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లోనూ వడదెబ్బ చికిత్సకు ఏర్పాట్లు చేశాం. వైద్యుల సూచనలు తప్పక పాటించాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఎండలోకి వెళ్లకుండా చూడాలి.

– బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ, శ్రీకాకుళం

మరో ఐదు రోజులు..

ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదై గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల పొడి వాతావరణం ఏర్పడుతోంది. వేడి గాలులు వీస్తున్నాయి. సాధారణం కంటే 5 నుంచి 6 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో ఐదు రోజులు ఎండతీవ్రత కొనసాగే అవకాశముంది.

– డాక్టర్ మౌనిక, వాతావరణ శాస్త్రవేత్త

32 పాఠశాలల్లో పీఎంశ్రీ

- నాడు-నేడు తరహాలో అభివృద్ధి చేయనున్న కేంద్రం
- పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన టెక్కలి బాలికల ఉన్నత పాఠశాల

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలికారు. సర్కారు బడుల రూపురేఖలను సమూలంగా మార్చారు. కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాడు-నేడు పథకం తీరును కేంద్ర బృందాలు సైతం పరిశీలన చేసి మెచ్చుకున్నాయి. ఇప్పుడు అదే మాదిరిగా దేశ వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎంశ్రీ' (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో 32 పాఠశాలలను ఎంపిక చేశారు.

సమకూర్చే వసతులివే..

పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు కొన్ని రకాల మౌలిక వసతులు సమకూరుస్తారు. కేంద్రం ఇచ్చే నిధులతో ప్రయోగశాలలు, ఉపాధ్యాయ అభ్యసన సామగ్రి, డిజిటల్ గ్రంథాలయాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే వసతులు, ప్లాస్టిక్ రహిత ప్రాంగణం, శుద్ధజలం, ప్రమాణాలతో కూడిన బోధన , ఇంటర్నెట్ సదుపాయం, స్మార్ట్ తరగతి గదులు, క్రీడా మైదానాల అభివృద్ధికి అవసరమైన పరికరాలు, ఆరోగ్య కార్యక్రమాలు, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ వ్యవస్థ, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, ఎల్ఈడీ లైట్లు, పచ్చదనం పెంపు, దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన బోధనా పరికరాలు, పాఠశాలలోనే సేంద్రియ విధానంలో కూరగాయలను పండించడం, సంప్రదాయ విధానాలపై పిల్లలకు అవగాహన, ప్రతి విద్యార్థి సరైన గ్రేడ్‌లో నైపుణ్యాలు కలిగి ఉండేలా వసతులు కల్పిస్తారు. దీనికి సంబంధించి యూడైస్ ఆధారంగా సుమారు 46 అంశాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 32 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల ప్రతిపాదనలను విద్యా శాఖా ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు అందజేస్తే వాటిని రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రానికి పంపుతారు.

ఎంపికైన పాఠశాలలివే..

ఏపీ మోడల్ స్కూల్(ఈదులవలస), ఏపీ మోడల్ స్కూల్(కరవంజ), ఏపీ మోడల్ స్కూల్(కొండములగాం), ఏపీ మోడల్ స్కూల్(ఓవీపేట), ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, గర్ల్స్(ఎచ్చెర్ల), ఏపీఎస్ఎంహెచ్ఎస్(గుజరాతీపేట), జీహెచ్ఎస్(ఇచ్ఛాపురం), జీహెచ్ఎస్(కొత్తూరు), జీహెచ్ఎస్(నరసన్నపేట), జీహెచ్ఎస్ (పాతపట్నం), జీహెచ్ఎస్(పొందూరు), జీహెచ్ఎస్ (సంతబొమ్మాళి), జీహెచ్ఎస్(సోంపేట), ఎంపీఎల్ యూపీఎస్(గేదెలవానిపేట), ఎంపీయూపీఎస్(బ్రాహ్మణతర్లా), ఎంపీయూపీఎస్(శుభలయి), జెడ్పీజీహెచ్ఎస్(టెక్కలి), జెడ్పీహెచ్ఎస్(అంపోలు), జెడ్పీహెచ్ఎస్(బుడితి), జెడ్పీహెచ్ఎస్(చాపర), జెడ్పీహెచ్ఎస్(డి.బొండపల్లి), జెడ్పీహెచ్ఎస్(హరిపురం), జెడ్పీహెచ్ఎస్(కరకవలస), జెడ్పీహెచ్ఎస్(కాశీబుగ్గ), జెడ్పీహెచ్ఎస్(కొత్తశాసనాం), జెడ్పీహెచ్ఎస్(కురుడు), జెడ్పీహెచ్ఎస్(ఎం.సరియాపల్లి), జెడ్పీహెచ్ఎస్(నందిగాం), జెడ్పీహెచ్ఎస్(పాతటెక్కలి), జెడ్పీహెచ్ఎస్(రాజపురం), జెడ్పీహెచ్ఎస్(సింగుపురం), జెడ్పీహెచ్ఎస్(వెంకటాపురం).

నాడు-నేడు మాదిరిగా..



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు పథకం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. కొన్ని రకాల అంశాలను పరిగణలోకి తీసుకుని జిల్లాలో 32 పాఠశాలను ఎంపిక చేశాం. ఆయా పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు సేకరించాం.

– కె.తిరుమలచైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి

ఎమ్మెల్సీ నర్తుకు ఘన స్వాగతం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వెలగపూడిలో ప్రమాణ స్వీకారం చేసిన నర్తు రామారావు బుధవారం తొలిసారి స్వగ్రామానికి వచ్చిన క్రమంలో ఇచ్ఛాపురం రైలు నిలయం వద్ద వైఎస్సార్ సీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీతో పాటు జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ స్థానిక కూడలిలో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రైతు ద్రోహి అచ్చెన్న

- సాగునీరు అందకుండా అడ్డంకులు సృష్టించారు
- మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు/రూరల్: అధికారాన్ని అడ్డం పెట్టుకొని అనధికారిక లిఫ్టులను ఏర్పాటు చేసి వంశధార శివారు భూములకు సాగునీరు అందకుండా చేసిన టీడీపీ ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అసలైన రైతు ద్రోహి అని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతుల పట్ల చంద్రబాబుకు ఎలాంటి చులకన భావన ఉందో అతని అనుచర గణమైన అచ్చెన్నాయుడికీ అలాంటి భావనే ఉందన్నారు. వంశధార శివారు రైతుల ప్రయోజనాలను విస్మరించి అనధికారిక లిఫ్టులను ఏర్పాటు చేసి తన ప్రాంత రైతులకు మాత్రమే మేలు చేశారని మండిపడ్డారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే నేరడి బ్యారేజి నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించేందుకు ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఇప్పటికే ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ప్రాజెక్టుకు అప్పయ్యదొర ప్రాజెక్ట్‌గా నామకరణం చేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. సర్పంచ్ టి.ఢిల్లీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, ఎంపీటీసీ ఉరిటి దమయంతి, సర్పంచ్‌లు కె.భాస్కరరావు, కె.మల్లేశ్వరావు, నాయకులు టి.శాంతారావు, యదళ్ల రాజారావు, టి.అప్పారావు, కర్ణకర్, గూడ ఈశ్వరరావు, రమేష్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, డీఎల్‌డీఓ ఎల్.అలివేలు మంగమ్మ, డీటీ గిరిరాజ్ పాల్గొన్నారు.

ఉత్సవ శోభ

- పాతపట్నం నీలమణిదుర్గ పెద్దపండగకు చురుగ్గా ఏర్పాట్లు
- ఈ నెల 21 నుంచి 30 వరకు ఉత్సవాల నిర్వహణ



నీలమణిదుర్గ అమ్మవారు



ముస్తాబవుతున్న పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం



సిద్ధమవుతున్న దేవతా విగ్రహాలు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి పెద్ద పండగకు పాతపట్నం ముస్తాబవుతోంది. ఈ నెల 21 నుంచి 30 వరకు పండగ పకడ్బందీగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఏడేళ్లకోసారి జరిగే ఈ పండగ కరోనా కారణంగా రెండేళ్లు వాయిదాపడింది. ఈ నేపథ్యంలో తొమ్మిదేళ్ల తర్వాత పండగ జరుగుతుండటంతో వైభవంగా నిర్వహించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. అమ్మవారి గుడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, ఆల్‌ఆంధ్రా రోడ్డులో ఇందిరమ్మ కాలనీ వరకు విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. అమ్మవారి గుడి, శివశంకర్ కాలనీ, దువ్వారివీధి, ఆల్‌ఆంధ్ర రోడ్డు, బస్టాండ్, అచ్చుతాపురం, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడళ్లలో భారీ ముఖద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎరుకొల కాంప్లెక్స్ ఆవరణలో ఎగ్జిబిషన్, మార్కెట్ యార్డులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు అమ్మవారి ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. విగ్రహాలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 21 నుంచి ఉత్సవాల ప్రారంభ సూచికగా ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం కేంద్రీయ విద్యాలయంలో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని కలెక్టర్, కేంద్రీయ విద్యాలయ నిర్వహణ కమిటీ చైర్మన్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కేవీ ప్రవేశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై కేంద్రీయ విద్యాలయ నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 అకడమిక్ విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల ప్యానెల్, ఒకటో తరగతి, ఆపై క్లాసుల ప్రవేశాలకు నిబంధనల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ కె.శంకరయ్య, కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తరగతి గదుల మరమ్మతులు, వస్తువుల సేకరణ తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్‌కు నివేదించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనూరాధ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్‌షాప్‌లో కల్తీ మద్యం పట్టివేత

● సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లపై కేసు నమోదు

పాతపట్నం: నీళ్లు కలిపి అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న వైన్‌షాపుపై బుధవారం సాయంత్రం ఎక్సైజ్,విజిలెన్స్ సీఐ ఎం.రాజేష్‌కుమార్ బృందంతో దాడులు నిర్వహించారు. మండలంలోని తెంబూరు గ్రామ సమీపంలో ఉన్న వైన్‌షాపులో కొద్ది రోజులుగా మద్యం బాటిళ్లలో నీరు కల్తీ చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో దాడులు చేసి షాపును తనిఖీ చేశారు. ఎంహెచ్ 25 ఫుల్ బ్యాటిళ్లు, ఎనిమిది పీఎం 20 ఫుల్ బ్యాటిళ్లలో నీళ్లు కలిపి అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో సూపర్‌వైజర్ ఉమా, సెల్స్‌మెన్ బాలకృష్ణలపై కేసునమోదు చేశామని సీఐ రాజేష్‌కుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ బి.శ్రీరామూర్తి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వాహనం బోల్తా



బోల్తాపడిన బొలేరొ వాహనం

కోటబొమ్మాళి: పొడుగుపాడు వద్ద జాతీయ రహదారిపై బొలేరొ వాహనం బుధవారం బోల్తా పడింది. అయితే ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం నుంచి టెక్కలి మండలం సాకిపల్లి కొత్తూరుకు ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న వాహనం పొడుగుపాడు వద్దకు వచ్చేసరికి వెనుక టైర్ పక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో వెనుక వస్తున్న రెండు లారీల డ్రైవర్లు ప్రమాదాన్ని గమనించి సడన్ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటనలో బొలేరొ డ్రైవర్ పంగ సింహాచలం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనం బోల్తాతోపాటు అందులోనున్న ఉల్లిపాయలు, ఇతర సామగ్రి చెల్లాచెదురుగా రోడ్డుకు అడ్డంగా పడ్డంతో కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్‌హెచ్–16 పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

పారిశ్రామికవేత్తలుగా మహిళలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో బుధవారం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి సంఘంలో ఒకరు గానీ, ఇద్దరు ముగ్గురు గానీ కలిసి చిన్న పరిశ్రమల యూనిట్ల ఏర్పాటుకు ముందుకొస్తే ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. ఈ ఏడాది మహిళల ఆధ్వర్యంలో 750 వ్యాపార యూనిట్లు నిర్వహణ లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. బ్యాంకులు సైతం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా రుణాలు అందజేస్తున్నాయని తెలిపారు. ఔత్సాహిక మహిళలను గుర్తించి బ్యాంకు రుణాలు ఇప్పించి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పదోన్నతుల పర్వం ప్రారంభం

● ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్
● తొలుత ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పదోన్నతులు
● సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చిన అధికారులు
● నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ
● సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ పిలుపు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: సర్కారీ బడుల్లో గురువుల పదోన్నతులకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దింది. ఇంగ్లీషు మీడియంను చేరువ చేసింది. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరిట పౌష్టికరమైన భోజనం, ఆరోగ్యవంతమైన రాగీ మాల్ట్‌తో చదువుకునేందుకు అవసరమైన అన్ని వస్తువులతోకూడిన జగనన్న విద్యాకానుకను అందిస్తోంది. ఇతర అన్ని రకాలైన మౌలిక వసతులు కల్పిస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా పాఠాలు బోధించే నాణ్యమైన, అర్హత కలిగిన టీచర్ల ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో వేసవి సెలవుల్లోనే పదోన్నతులను పూర్తిచేయాలని నిర్ణయించింది. కొత్త విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు లేమితో స్కూళ్లు ఉండకూడదన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు నడుం బిగించారు. ఇప్పటికే పాఠశాల విద్యా కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పదోన్నతల ప్రక్రియకు జిల్లాలో అధికారులు సమాయత్తమయ్యారు.

తొలుత వీరికే...

పదోన్నతుల్లో భాగంగా తొలుత స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు), పీఈటీ, తత్సమాన కేటగిరి సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు.

సీనియారిటీ జాబితా సిద్ధం..

జిల్లా పదోన్నతలకు సంబంధించి అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కూడిన సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. దీనిని జిల్లా విద్యాశాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ 'డీఈవోఎస్‌కెఎల్‌ఎం.ఓఆర్‌జీ'లో పొందుపర్చారు. ఈ సీనియారిటీ జాబితాకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి వాటిని సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారి పేర్లను జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తలకొరివి పెడుతున్న పండమ్మ

లావేరు: పెదలింగాలవలస గ్రామానికి చెందిన వందాన అశిరయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయనకు కుమారులు లేరు. దీంతో కుమార్తె పండమ్మ తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టి చితికి నిప్పు అంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కన్నతండ్రి రుణం ఈ విధంగా తీర్చుకోవడంపై స్థానికులు ఆమెను అభినందించారు. ఏఎంసీ మాజీ డైరెక్టరు, గ్రామపెద్ద లుకలాపు అప్పలనాయుడుతో పాటు గ్రామస్తులు దగ్గరుండీ పండమ్మకు సహకరించి అశిరయ్య మృతదేహానికి దహన సంస్కారాలు చేయించారు.

ఇద్దరు ఉపాధి వేతనదారులకు పాముకాటు

● చికిత్స అనంతరం కోలుకుంటున్న మహిళలు



చికిత్స పొందుతున్న సూర్యకాంతం

రణస్థలం: ఇద్దరు ఉపాధి హామీ పథకం వేతనదారులు పాముకాటుకు గురయ్యారు. ఈ సంఘటన మండలంలోని వెంకటరావుపేట, నెలివాడ గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరావుపేట గ్రామంలో కొత్తకోట్ల లక్ష్మి చెరువులో పని చేస్తుండగా పాము కాటుకు గురికావడంతో హుటాహుటీనా రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించి చికిత్స అందించారు. అలాగే నెలివాడలో చెరువు పనులు చేస్తుండగా నొకట్ల సూర్యకాంతం పాము కాటుకు గురికావడంతో ఆమెను కూడా సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందజేశామని చెప్పారు. ప్రమాదకరమైన విషసర్పాలు కాకపోవడంతో ఎటువంటి ప్రాణహాని లేదని చెప్పారు. మహిళలిద్దరిని 24 గంటల ప్రత్యేక పరిశీలనలో ఉంచుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వి.ప్రసాద్‌రావు తెలిపారు. ఇద్దరూ కోలుకుంటున్నారన్నారు. వేతనదారులను ఎంపీడీవో వి.ధనుంజయరావు పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రధానమైన కేసుల రికార్డులను పరిశీలించారు. ముఖ్యమైన కేసుల గురించి ఆరా తీశారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యువత మేలు కోరే విధంగా ప్రతిష్టాత్మకంగా రూపొందిన జాగృతి కార్యక్రమంలో భాగమైన పోలీసు విధులు, చట్టాలు, శిక్షలు, చెడు వ్యసనాలకు అలవాటు పడడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. దిశ యాప్‌ను యువతీ యువకుల మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసేవిధంగా ప్రతీ పోలీసు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వై శృతి, టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభ్యసన మెరుగుపడేలా బోధన

● డీఈవో తిరుమల చైతన్య



మాట్లాడుతున్న తిరుమల చైతన్య

కాశీబుగ్గ: అభ్యసన మెరుగుపరిచే విధంగా బోధనలు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులైన 1998, 2008, 2018 ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఐదు రోజులు నేర్చుకున్న వివిధ అంశాలు తరగతి గదిలో బోధించి అభ్యసన మెరుగుపరిచే విధంగా తయారవ్వాలని సూచించారు. తరగతి గదిలో బోధన జరగాలనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చే విధంగా, పర్యావరణంపై స్పృహ కలిగే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. అందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతోందన్నారు. అనంతరం వీటికి సంబంధించిన ప్రయోగాల్ని శిక్షణార్థులకు చేసి చూపించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ వై.చిన్నామునాయుడు, సమన్వయకర్త ఎ.వేణుగోపాలరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు ఎల్వీ చలం, అర్.వి.రమణమూర్తి, కె.వి.రమణ, సీహెచ్ సంతోష్, బి.వి.రమణ, మల్లేశ్వరరావు, పాఠశాల పీడీ కె.హరిబాబు పాల్గొన్నారు.

అడవిపంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు



అడవిపంది మాంసంతో పట్టుబడిన నిందితులు, పక్కనే అటవీ సిబ్బంది

పాతపట్నం: కొదూరు గ్రామంలో అడవి పందిని చంపి మాంసాన్ని వాటాలుగా విక్రయిస్తున్న ఇద్దరిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి యసస్వీ తెలిపారు. కొదురు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం పక్కన రెకుల షెడ్‌లో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు అడవి పందిని చంపినట్టు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన డి.చిన్నారావు, జి.సింహాచలం అడవిపంది మాంసం వద్ద ఉండడంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. వారిని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని ఎఫ్ఎస్‌వో తెలిపారు. దాడుల్లో ఎఫ్‌బీవో ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రపంచ శాంతికి మార్గదర్శకుడు గాంధీ



గాంధీ మందిరంలో దిలీప్‌కుమార్, కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచశాంతికి మార్గదర్శకత్వం వహించిన మహనీయుల్లో మహాత్మాగాంధీ ముందంజలో ఉంటారని తమిళనాడు రాష్ట్రానికి చెందిన శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్, కేరళ గాంధీదర్శన్ వేది చైర్మన్ ప్రొఫెసర్ ఎం.సి.దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న మహాత్మాగాంధీ మందిరాన్ని బుధవారం సందర్శించారు. స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయోద్యమ నేతలు, సంఘ సంస్కర్తల విగ్రహాలను తిలకించారు. దేశ స్వాతంత్య్ర భావజాలాన్ని నేటితరానికి అందించే ప్రయత్నం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. అన్నామలై యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ సుందరమూర్తి పెరుమాళ్ మాట్లాడుతూ గాంధీ విధానాలు ప్రపంచానికే ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు నటుకుల మోహన్, మెట్ట అనంతభట్లు, కమిటీ సమన్వయకర్త ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, వంగా మహేష్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆటో

● మామిడిపండ్ల వ్యాపారి దుర్మరణం



మణికంత మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అల్లినగరం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడిపండ్ల వ్యాపారి దుర్మరణం చెందాడు. లారీని వెనుక నుంచి ఆటో ఢీ కొట్టటంతో కొక్కిర మణికంత ప్రాణాలు కోల్పోగా, డ్రైవర్ నేతూరు చిన్నారావుకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం సాతంవలస గ్రామానికి చెందిన మణికంత ఐదేళ్ల నుంచి మామిడి పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఆటోలో మామిడి పండ్లు తీసుకురావటం, అమ్మకం పూర్తయ్యాక తిరిగి వెళ్లటం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి తరువాత ఆటోలో మామిడి పండ్లతో శ్రీకాకుళం వస్తుండగా లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన మణికంత అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడిన చిన్నారావుని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడు మణికంత తల్లి రాములమ్మ, భార్య తేజ రిమ్స్‌కు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమత్తులో ఉద్యోగులు!



తహసీల్దార్ కార్యాలయంలో నిద్రపోతున్న సీనియర్ అసిస్టెంట్ గోవిందరాజు



బయట ఉన్న కుర్చీలో పడుకున్న జూనియర్ అసిస్టెంట్ రాజేష్

లావేరు: లావేరు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులు బుధవారం విధి నిర్వహణలో నిద్రపోవడం విమర్శలకు తావిచ్చింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కొందరు వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయానికి పనుల కోసం వచ్చారు. ఆ సమయంలో సీనియర్ అసిస్టెంట్ గోవిందరాజు కార్యాలయంలో, జూనియర్ అసిస్టెంట్ రాజేష్ కార్యాలయం బయట కుర్చీల్లో నిద్రపోతున్నారు. అటెండర్ బాబూరావు షర్టు విప్పి అర్ధనగ్నంగా కనిపించారు. సెల్‌ఫోన్ ద్వారా వీరి ఫొటోలు తీసినా లేవలేదు. మద్యం మత్తులో ఉండటం వల్లే లేవలేదని విలేకర్లకు సమాచారం అందించారు. ఈ విషయమై సీనియర్ అసిస్టెంట్ గోవిందరాజులు వివరణ కోరగా ఎండ తీవ్రత, అనారోగ్య సమస్య వల్ల విశ్రాంతి తీసుకున్నానని, మద్యం సేవించలేదని చెప్పారు. జూనియర్ అసిస్టెంట్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో రాలేదు.

పరిశీలిస్తా..

ఈ విషయమై లావేరు తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. తాను సెలవులో ఉన్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ వేరే పనుల కోసం బయటకు వెళ్లారని తెలిపారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విధుల సమయంలో కార్యాలయంలోనే నిద్రపోయారన్న విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని చెప్పారు.

చల్లని సమయాల్లో 'ఉపాధి'



పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం రూరల్: ఉపాధి వేతనదారులు ఉదయం, సాయంత్రపు వేళల్లో పనికి హాజరై కనీసం ఆరు గంటల పాటు శ్రమిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. బుధవారం బలివాడ, ఇప్పిలి పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనికి రావాలన్నారు. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సీతారాం, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీ బాబు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు స్పందన కరువు

● జనం లేకపోవటంతో రెండు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభం
● గైర్హాజరైన టీడీపీ ప్రముఖులు





సభా సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు (ఇన్‌సెట్లో) ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లేక వెలవెలబోయింది. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు గైర్హాజరయ్యారు. జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షురాలు గౌతు శిరీష హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. కళా వెంకటరావు, అయ్యన్నపాత్రుడు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విశాఖ జిల్లాలో పర్యటిస్తున్నందున అక్కడ పాల్గొనడంతో మినీ మహానాడుకు హాజరు కాలేకపోయారని కొందరు కార్యకర్తలు అభిప్రాయపడగా, రెండు కార్యక్రమాలు ఒకేసారి నిర్ణయించడం ఏంటని మరికొందరు నిలదీశారు. సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభం కావల్సి ఉన్నా జనం లేకపోవటంతో రాత్రి 7 గంటలకు ప్రారంభించారు. దీంతో విసుగు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు సభా ప్రాంగణం నుంచి వెనుతిరిగారు.

సభా వేదికపైకి నాయకులను పిలవటం కొంత వివాదానికి దారితీసింది. ముఖ్యంగా శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన గొండు శంకర్‌ను వేదికపైకి ఆహ్వానించక పోవటంతో ఆయన అనుచరులు సభా ప్రాంగణం నుంచి వెనుదిరిగారు. వాస్తవానికి ఆయనే జనసమీకరణ చేయటం, జిల్లా నాయకులను, ముఖ్య అతిథులను సభా ప్రాంగణానికి తీసుకురావడం, బాణసంచా కాల్చటం వంటివి చేశారు. అలాంటిది ఆయనకు ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో వారంతా ప్రాంగణం ఖాళీ చేశారు. యనమల రామకృష్ణుడు ప్రసంగించే సమయానికి సభకు హాజరైన వారిలో సగం మందికి పైగా వెళ్లిపోయారు. ఆయన ఒకటి రెండు విషయాలు ఎన్టీఆర్ గురించి మాట్లాడిన తర్వాత జగన్‌పై విమర్శలకు దిగారు. కూన రవికుమార్, అచ్చెన్నాయుడు తదితరులు సుదీర్ఘ ప్రసంగం చేసి ఎన్టీఆర్ జయంతి వేడుకులు కంటే ప్రభుత్వాన్ని, జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించటంపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించారు. అశోక్ గజపతిరాజు ప్రసంగిస్తూ కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. కాగా, మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఆయన అభిమాన సంఘాల నేతృత్వంలో నిర్వహిస్తే ఘనంగా జరిగి ఉండేదని, పార్టీ పరంగా చేపట్టి ఎన్టీఆర్ ప్రతిష్టను దిగజార్చినట్లు అయిందని పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శించడం గమనార్హం. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బగ్గు లక్ష్మణరావు, కలమట వెంకటరమణ, గుండ అప్పల సూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి, బగ్గు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.